ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు..




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఘనంగా హిందీ భాషా దినోత్సవం..




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 262 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 16 సెప్టెంబర్ 2026

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రిని పునరుద్ధరించండి

టూరిజం, ఎడ్యుకేషన్ రంగాల్లో సహకరించండి : ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి ఆహ్వానం

తాజ్ ఫలక్ నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):**భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5ను కోరారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని ఆయన విజ్ఞప్తి చేశారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి అజహరుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, మిగతా2లో...




# బాదుడే!

నాడు జీఎస్టీ.. నేడు యూపీఐ

రూ. 2వేలు దాటితే

యూపీఐ లావాదేవీలపై త్వరలో

ఛార్జీల వసూలుకు కేంద్రం సన్నద్ధం

బ్యాంకర్లతో కమిటీ ఏర్పాటు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ వ్యాప్తంగా ఏటికేడాది పెరుగుతున్న యూపీఐ చెల్లింపుల వల్ల వీసా, మాస్టర్ కార్డ్ వంటి అమెరికా ఉత్పత్తులకు నష్టం వాటిల్లుతుందన్న ఆందోళనల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 2 వేలకు పైగా విలువైన యూపీఐ చెల్లింపులకు ఛార్జీలను వర్తింపచేయాలని నిర్ణయించింది. అయితే 2 వేలు దాటిన లావాదేవీలపై మిగతా2లో...



## మాజీ మంత్రి 'ఆళ్ల నాని' మృతి

- గుండెపోటుతో విశాఖలో కన్నుమూత

**ఏలూరు,సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ మంత్రి 'ఆళ్ల నాని' గుండెపోటుతో కన్నుమూసారు. జగన్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టిన ఆళ్ల నాని, తొలుత కాంగ్రెస్ ఎమ్మెల్యేగా.. ఆ తర్వాత వైఎస్ జగన్ హయాంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా సేవలు అందించారు. వైఎస్‌రాజశేఖరరెడ్డి హయాంలో మిగతా2లో...

## రాణాలో దాడిపై విచారణ జరిపించండి

● పూర్తి సీసీటీవీ ఫుటేజ్‌ను విడుదల చేసి బాధ్యులపై కేసులు నమోదు చేయాలి ● బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు ● కేటీఆర్ పీఏ, పీఆర్వోలపై దాడియత్నంపై ఖండన



**హైదరాబాద్, సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్‌పై ముసుగులు ధరించిన వ్యక్తులు సోమవారం దాడికి యత్నించిన ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. విచారణ పేరుతో పండుగ రోజున పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, సు మారు 15మంది ముసుగులు ధరించిన పోలీసులు ఇంటరాగేషన్ రూమ్‌లోకి వెళ్లి దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. మిగతా2లో...


# 22ఏ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి

- ఇది భూభారతి కాదు...భూహారతి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- 30 శాతం కమీషన్ల ? ప్రయత్నాలను మానుకోవాలి కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ?ఇండ్లను బేషరతుగా తొలగించాలిఇది భూభారతి కాదు... భూహారతి : కేటీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** 22ఏ కింద లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారనీ, 30 శాతం కమీషన్ల కోసం చేస్తున్న ఈ ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. 22ఏ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని కోరారు. మంగళవారం ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన కేటీఆర్ మిగతా2లో...




## నిందితులను నేరుగా అరెస్టు చేయొద్దు.. చట్టప్రకారమే దర్యాప్తు జరుపాలి

- ఎర్రవల్లి రోడ్డు శుద్ధి కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

## 22ఏపై నేడు సీఎం కీలక ప్రకటన

అసెంబ్లీలో ప్రసంగించనున్న రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం పది గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెక్షన్ 22ఏ అంశంపై చర్చ కొనసాగుతుందని అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి మంగళవారం తెలిపారు. 22ఏ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం చర్చను ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి మిగతా2లో...

## అంతర్రాష్ట్ర బస్సుల కోసం బస్ టెర్మినల్స్.. :పొన్నం








## శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాల సమర్పణ

- రేపు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం

**అమరావతి,సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా మిగతా2లో...

## గణనాథుడికి కేసీఆర్ దంపతులు ప్రత్యేక పూజలు



**హైదరాబాద్,సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** వినాయక చవితి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎర్రవెల్లి నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కేసీఆర్, సతీమణి శోభ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ కుమారుడు హిమాన్షు కూడా హాజరయ్యారు.

మిగతా2లో...

# 22ఏపై నేడు సీఎం కీలక ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమయ్యారు. 22ఏ అంశం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై చర్చ జరిగినట్టు తెలిసింది. 22ఏ నిషేధిత జాబితా వల్ల సామాన్య ప్రజలకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసే అవకాశమున్నది. ఉద్దేశపూర్వకంగానే ప్రజల భూములు, ఆస్తులను 22ఏ పరిధిలో చేర్చినట్టు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో స్పందించే అవకాశమున్నది. ప్రతిపక్షాలకు సమాధానం చెప్తారని తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారు, ఏం ప్రకటన చేస్తారనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. 22ఏ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఏమైనా ఉపశమనం కలుగుతుందా?అన్నదాని కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకోవైపు ధరణి పోర్టల్‌లో లోపాల వల్ల బీఆర్‌ఎస్ హయాంలో భారీగా భూదందాలు జరిగాయనే దానిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వివరించనున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మాజీమంత్రి హరీశ్‌రావు, అతని మామ భూబదలాయింపులను ప్రోత్సహించిన అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించనున్నట్టు సమాచారం. బీఆర్‌ఎస్ నేతల అక్రమ భూదందాలపై విచారణకు ఆదేశించే అవకాశం లేకపోలేదని తెలుస్తున్నది. ఇప్పటికే ధరణి అక్రమాలపై సెట్ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ధరణిపై ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించింది. ఆ నివేదికను ఇంకా బహిర్గతం చేయలేదు. దీనిపైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చే అవకాశముందని తెలిసింది. దీంతో అందరి చూపు బుధవారం జరిగే అసెంబ్లీ సమావేశాలపైనే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. 22ఏ అంశంపై చర్చ ముగిసిన అనంతరం ఎల్‌నినో ప్రభావంపై లఘు చర్చ ఉంటుందని అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి తెలిపారు.

# శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాల సమర్పణ

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుమలకు సాయంత్రం 6.20 గంటలకు శ్రీ గాయత్రీ నిలయానికి చేరుకుంటారు. రాత్రి 7.40 గంటలకు బేడి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. అనంతరం రాత్రి 7.55 గంటల నుంచి 9.15 గంటల వరకు వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించి, స్వామి వారిని దర్శించుకుంటారు. దర్శనం అనంతరం గాయత్రీ నిలయానికి చేరుకుని రాత్రి బస చేస్తారు.**తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం** బుధవారం ఉదయం 8.40 గంటలకు వీఐపీ క్యూ కాంప్లెక్స్-1లోని 17వ కంపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన యాత్రికుల అనుభవ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 9.15 గంటలకు గోగర్భం డ్యామ్ సర్కిల్ వద్ద ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభిస్తారు. 9.35 గంటలకు ఎస్వీ మ్యూజియాన్ని ప్రారంభిస్తారు. అధికారులతో సమావేశమవుతారు. తిరుమలలో కార్యక్రమాలను ముగించుకుని బుధవారం మధ్యాహ్నం 02.00 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

(మొదటి పేజీ తరువాయి)

అగా ఖాన్ ఫౌండేషన్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 తండ్రి, దివంగత ఆగా ఖాన్-4 మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఫౌండేషన్ తరఫున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు సీఎం గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు.**మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి** మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసా, మూసా నదుల సంగమంగా ఏర్పడిన మూసీ ఆక్రమణలకు గురి కావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సీఎం కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. **ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 ఆసక్తి** 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్-5 ఆసక్తి కనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ నిర్మిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందు కోసం సింగపూర్ కంపెనీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోందని వివరించారు. ఫ్యూచర్ సిటీని నెట్-జీరో సిటీగా ఏర్పాటు చేస్తామని, దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఉంటుందని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు తెలిపారు. ఇప్పటికే అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సీఎం వెల్లడించారు. **2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం** 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా ప్రస్తుతం 2.5 శాతం ఉందని, దాన్ని 10 శాతానికి పెంచుతామని తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు. సమ్మిట్‌కు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 సీఎం ఆహ్వానించారు. సమ్మిట్‌లో 100కు పైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటారని, వ్యాపార అవకాశాల కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని సీఎం వివరించారు.**విద్యా, పర్యాటక రంగాల్లో సహకారంపై చర్చ** ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు రామకృష్ణారావు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు వివరించారు. హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడా నికి అంగీకరించాయని ఆయన తెలిపారు. మరోవైపు, ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా కోరారు. పర్యాటక రంగంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ పాత్రను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ గుర్తు చేశారు. భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని ఆమె కోరారు.

# 22ఏ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. 22ఏ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సరైన సమాధానం ఇస్తుందని ఆశించామనీ, రెవెన్యూ మంత్రి కేవలం 'సారీ'తో సరిపెట్టారని అన్నారు. "తప్పు చేసింది అధికారులు కాదనీ ప్రభుత్వమేనని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులపై నెపం నెట్టడం సరికాదన్నారు. ప్రజలు కష్టార్జితంతో కొనుగోలు చేసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇండ్లను నిషేధిత జాబితాలో చేర్చినట్లయితే వాటిని బేషరతుగా తొలగించి, బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ధరణి రక్షణ కవచంధరణి వ్యవస్థ ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఉండేదని కేటీఆర్ అన్నారు. యజమాని వేలిముద్ర లేకుండా ఆస్తి బదిలీ చేయడం సాధ్యం కాని విధంగా భద్రత ఉండేదన్నారు.ప్రస్తుతం యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనీ, ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్తున్నాయని ఆరోపించారు. ఇది భూభారతి కాదనీ, భూ హారతి అని విమర్శించారు. అన్ని అడ్డగోలు చర్యలను నిలిపేసి, ప్రజల యాజమాన్య హక్కులకు రక్షణ కల్పించేలా యథాతథ పరిస్థితిని పునరుద్ధరించాలని కోరారు.అసైన్డ్ భూములపై హామీ నిలబెట్టుకోవాలిఅసైన్డ్ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి, వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని అన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి పథకం వెనుక అక్రమాలు ఉన్నాయని చెప్పారు. రెండేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తుందనీ, తప్పు చేసిన వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు.ప్రధాన ప్రతిపక్షాన్ని సభ నుంచి బయటకు పంపారుప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా నిరసన తెలిపే హక్కు తమకుందని కేటీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ సభ్యులు అనని మాటలను అంటగట్టి, సభ నుంచి బయటకు పంపారని ఆరోపించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాల నుంచి తప్పించుకునేందుకే తమను సస్పెండ్ చేసిందన్నారు.సస్పెండ్ చేసినప్పటికీ తాము ప్రజల్లోనే ఉన్నామని చెప్పారు. ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూనే ఉంటామన్నారు.తప్పు చేసింది ప్రభుత్వం శిక్ష అనుభవిస్తున్నది ప్రజలు అని వ్యాఖ్యానించారు. నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చడం ద్వారా ప్రజల యాజమాన్య హక్కులను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇవాళ తప్పించుకున్నా రేపు తప్పించుకోలేరని హెచ్చరించారు.పోలీసులపై నమ్మకం లేదు.. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాంప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ సిబ్బందిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అక్కడే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా పనిచేస్తున్నారని విమర్శించారు. పోలీసులను నమ్ముకుంటే న్యాయం దొరకదనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నామని చెప్పారు. న్యాయస్థానంలో తప్పకుండా న్యాయం దొరుకుతుందని ఆశిస్తున్నామని అన్నారు.

# చైనాలో 2027 బ్రిక్స్ సదస్సు : జిన్‌పింగ్



**న్యూఢిల్లీ :సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** వచ్చే సంవత్సరం జరిగే బ్రిక్స్ సదస్సుకు తాము ఆతిథ్యం ఇస్తామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తెలిపారు. 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో జిన్‌పింగ్ ప్రసంగించిన తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం జరిగే సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నందుకు ఆయనను అభినందించారు. జిన్‌పింగ్ ప్రకటనను చైనా అధికార వార్తా సంస్థ సిన్హువా, భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం ధృవీకరించాయి. అయితే సదస్సును ఎక్కడ, ఎప్పుడు నిర్వహిస్తారనే వివరాలు తెలియలేదు.

# బాదుడే!

(మొదటి పేజీ తరువాయి)

ఛార్జీలు విధించాలన్న నిర్ణయంపై విపక్షాలతో పాటు సాధారణ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో కేంద్రం ఇవాళ మరో కీలక ప్రకటన చేసింది.2 వేలు దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీలు విధిస్తామని, అయితే ఈ ఛార్జీల్ని వినియోగదారులు చెల్లించాల్సిన అవసరం లేదని, వ్యాపారులే చెల్లిస్తారని కూడా కేంద్రం వెల్లడించింది. వినియోగదారులకు ప్రస్తుతం ఉన్న విధంగానే యూపీఐ సేవలు ఉచితంగానే అందుబాటులో ఉంటాయని 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' స్పష్టం చేసింది. సవరించిన యూపీఐ మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానం అక్టోబర్ 15 నుండి అమల్లోకి రానుందని కూడా ప్రకటించింది.కేంద్రం వాదన ఎలా ఉన్నా.. యూపీఐ చెల్లింపులు చేసేటప్పుడు అవి 2 వేలు మించితే వ్యాపారులపై భారం పడినా, వారు తిరిగి వినియోగదారులపైనే దాన్ని మోపుతారు. ఇదే అంశాన్ని విపక్షాలు పదే పదే ప్రస్తావిస్తున్నా కేంద్రం మాత్రం నేరుగా భారం పడటం లేదని వాదిస్తోంది. ఇప్పుడు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఎన్సీపీఐ కూడా వినియోగదారులపై ఎలాంటి భారం పడదని చెబుతోంది. కానీ వ్యాపారులు తమపై పడే చిన్న భారాన్ని కూడా వినియోగదారులపై బదిలీ చేయడం మొదలుపెడితే యూపీఐ లావాదేవీలు నెమ్మదించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మాజీ మంత్రి 'ఆళ్ల నాని' మృతి

(మొదటి పేజీ తరువాయి)

యువజన కాంగ్రెస్ నాయకునిగా కొనసాగిన నాని మూడు సార్లు ఎమ్మెల్యేగా కొనసాగారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమి అనంతరం పార్టీకి దూరంగా ఉంటూ వచ్చిన ఆయన ఇటీవలే టీడీపీలో చేరారు. ఆళ్ల నాని మృతితో ఏలూరులో విషాదం నెలకొంది. నాని పార్థీవదేహాన్ని విశాఖపట్నం నుండి ఏలూరు తీసుకొచ్చి ఏలూరులో అంత్యక్రియలు జరపనున్నారు.

# అంతర్రాష్ట్ర బస్సుల కోసం బస్ టెర్మినల్స్..: పొన్నం

**హైదరాబాద్,సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతోపాటు ఔటర్‌రింగ్ రోడ్డు వైపు నుంచి వచ్చే బస్సులను నగరంలోకి రాకుండా టెర్మినల్స్ వరకే నడిచేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయం వైపు వెళ్లే బస్సులు, నగరానికి వచ్చే అంతర్ జిల్లా బస్సులు కూడా అవసరాన్ని బట్టి నిర్దేశిత టెర్మినల్స్ వద్దే నిలిపి, అకడి నుంచి ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. దీంతో నగర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉన్నదని తెలిపారు. గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలపై దృష్టి సారించామని వెల్లడించారు. ఆయా టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా సిటీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను సమన్వయం చేస్తున్నట్టు పేర్కొన్నారు. **కుట్టుమిషన్ల దరఖాస్తు గడువు 30కు పొడిగింపు** బీసీ సంక్షేమశాఖ బీసీ మహిళల కోసం కుట్టుమిషన్ల పంపిణీ పథకానికి సంబంధించిన దరఖాస్తుల గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1.19 లక్షల మంది మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్టు తెలిపారు. 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు కుట్టుమిషన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 3.50 లక్షల మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నట్టు బీసీ సంక్షేమశాఖ వర్గాలు వెల్లడించాయి.

# గణనాధుడికి కేసీఆర్ దంపతులు ప్రత్యేక పూజలు

(మొదటి పేజీ తరువాయి)

తాత, నానమ్మతో కలిసి అతడు కూడా పూజలో పాల్గొన్నారుబీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సతీ సమేతంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఎర్రవెల్లి నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కేసీఆర్, సతీమణి శోభ పాల్గొన్నారు. మట్టి వినాయకుడికి పూజలు చేసి.. తెలంగాణ ప్రజానీకం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ కుమారుడు హిమాన్షు కూడా హాజరయ్యారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించి, విజయాలను అందించే దైవంగా, వినాయకుణ్ణి హిందూ సమాజం కొలుచుకుంటుందని అన్నారు.దైవ పూజలను, ధార్మిక క్రతువులు విఘ్నేశ్వరుని పూజతో ప్రారంభించడం ద్వారా హిందూ సంప్రదాయాల్లో గణనాయకునికి తొలి ప్రాధాన్యతనిస్తామని కేసీఆర్ తెలిపారు. వాడ వాడలా మండపాలు ఏర్పాటు చేసుకుని తొమ్మిది రోజుల పాటు గణేశ్ నవరాత్రులు జరుపుకుంటూ, పిల్లలు పెద్దలు అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయకునికి పూజలు నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం తిరిగి గాడినపడి, పాడి పంటలతో తెలంగాణ రైతు కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని కోరుతూ, ఏకదంతుడిని కేసీఆర్ ప్రార్థించారు.

# ఠాణాలో దాడిపై విచారణ జరిపించండి

(మొదటి పేజీ తరువాయి)

లీగల్ టీమ్ అడ్డుకోవడంతో వారు వెనుదిరిగారని తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్‌ను విడుదల చేసి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# నిందితులను నేరుగా అరెస్టు చేయొద్దు.. చట్టప్రకారమే దర్యాప్తు జరుపాలి

## - ఎర్రవల్లి రోడ్డు శుద్ధి కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్,సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నివాసం వద్ద రోడ్డును పసుపునీటితో శుద్ధి చేశారంటూ నమోదైన కేసులో నిందితులను నేరుగా అరెస్టు చేయరాదని హైకోర్టు ఆదేశించింది. నిందితులకు నోటీసులు జారీచేసి చట్టప్రకారం ఈ కేసు దర్యాప్తు జరుపాలని పోలీసులకు స్పష్టం చేసింది.ఈ కేసులో తమను అక్రమంగా అరెస్టు చేసే అవకాశం ఉన్నదన్న అనుమానంతో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు వేర్వేరుగా 3 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలు చేయడంతో జస్టిస్ టీ మాధవీదేవి మంగళవారం పై ఆదేశాలు జారీచేశారు.

# నవ సమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర వెలకట్టలేనిది..

**నగర అభివృద్ధికి ఇంజనీర్లే వెన్నెముక: మేయర్ కొలగాని శ్రీనివాస్..**

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతదేశ సాంకేతిక పితామహుడు, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఇంజనీర్స్ డే వేడుకలను కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై సర్ ఎం. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని, నగర అభివృద్ధికి ఇంజనీరింగ్ విభాగమే వెన్నెముకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ కరీంనగర్‌ను ఆధునిక, సుందర, సౌకర్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ఇంజనీర్లు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. **మౌలిక వసతుల పనులు వేగంగా పూర్తి చేయాలి:** నగరంలో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ,



తాగునీటి సరఫరా, పైప్‌లైన్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. **స్మార్ట్ సిటీ లక్ష్యాల సాధనకు కృషి:** కరీంనగర్‌ను ఆధునిక సాంకేతికతతో కూడిన సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు ఇంజనీరింగ్ విభాగం కీలక పాత్ర పోషించాలని అన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. **ప్రజాధనానికి పూర్తి న్యాయం చేయాలి:** ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే ప్రతి రూపాయి ప్రజల సంక్షేమం, నగర అభివృద్ధి కోసం సద్వినియోగం కావాలని మేయర్ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రతి పనిని పారదర్శకంగా, నాణ్యతతో, ప్రజలకు ఉపయోగపడే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మేయర్ నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందికి ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. సర్ ఎం. విశ్వేశ్వరయ్య చూపిన క్రమశిక్షణ, నిబద్ధత, సాంకేతిక నైపుణ్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఎస్ఈ, ఈఈలు, డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

**అక్టోబర్ 4న జిల్లా మేనేజింగ్ కమిటీ ఎన్నికలు**

**జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

**ములుగు జిల్లా సెప్టెంబర్15(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత రెడ్‌క్రాస్ సొసైటీ ములుగు జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ ఆదేశాల మేరకు ములుగు జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలను అక్టోబర్ 4న నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, నిర్ణీత కాలపట్టిక ప్రకారం నిర్వహించాలని సూచించారు. అర్హులైన సభ్యులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ ఓటర్ల జాబితా



పరిశీలన, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల అధికారిగా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ధర్మ నాయక్‌ను, ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్‌రావును నియమించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 19న తుది ఓటర్ల జాబితాతోపాటు ఎన్నికల ప్రకటన విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, ఒక్కో నామినేషన్‌కు తిరిగి చెల్లించని డిపాజిట్‌గా రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన, 26న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించి, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారని వెల్లడించారు. అవసరమైతే అక్టోబర్ 4న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా శాఖ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడి ఎన్నికను అదేరోజు నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు..





**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో లిఇంజినీర్స్ డేలి వేడుకలను తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ భవనంలో ఇంజినీర్లను సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతరత్న లిసర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యలి జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని, సాంకేతిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ఇంజినీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమానికి లికరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ సత్తు మల్లేష్‌లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావులిలి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. పలువురు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు అతిథులుగా పాల్గొన్నారు. వల్లాల కృష్ణహరి పాల్గొన్నారు. సైనేని నరేందర్ ప్రోగ్రామ్ చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఇంజినీర్లను ఘనంగా




సత్కరించారు. ఈ కార్యక్రమంలో లిమయడం శివకాంత్ పటేల్, అధ్యక్షులు; చిదుర సురేష్, జూణ, డిస్ట్రిక్ట్ 320+; పెద్ది విద్యాసాగర్; ముక్క శరత్ కృష్ణ; బట్టు వినోద్ పటేల్; మెతుకు కృష్ణ చైతన్య; ఐతా సూరజ్ కుమార్; కంభం ప్రసాద్; కోల అన్నారెడ్డి; గూడ ధర్మారెడ్డి; మెతుకు సత్యం; సింగమ రాజు; శ్రీరాముల శ్రీని వాస్; బండ సంతోష్; తంగెళ్లపల్లి రమేష్; కాదర్ల ప్రభాకర్; నర్ల సాయి కృష్ణ; గజవాడ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఘనంగా హిందీ భాషా దినోత్సవం..






**హనుమకొండ, సెప్టెంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటానమస్), హనుమకొండ నందు హిందీ భాషా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్ గారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ, హిందీ భాషకు భారత రాజ్యాంగం అధికార భాషగా గుర్తింపు పొందిన రోజైన సెప్టెంబర్ 14ను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హిందీ విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. సుమతి కార్యక్రమం ఉద్దేశాన్ని వివరిస్తూ, హిందీ భాషను సులభంగా నేర్చుకోవచ్చని, విద్యార్థులు ప్రతిరోజూ హిందీ వార్తలు వినడం ద్వారా భాషపై పట్టు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ అధ్యాపకులు కే. బెంజిమెన్ విక్టర్ గారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, హిందీ భాష నేర్చుకోవడం ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలను సందర్శించడంతో పాటు ఆయా ప్రాంతాల సంస్కృతులను సులభంగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఏ. శ్రీనాథ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె. చిన్న, హిందీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. నాగమణి, హరి ప్రసాద్, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**• డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్**



**మల్లంపల్లి: సెప్టెంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** సెప్టెంబర్ 17న నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ మల్లంపల్లి మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా బైకాని మహేందర్ యాదవ్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందిన సెప్టెంబర్ 17వ తేదీకి చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ఎంతోమంది అమరవీరుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే తెలంగాణ విమోచనం సాధ్యమైందని పేర్కొన్నారు. అలాంటి చారిత్రక దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ప్రజలకు తెలంగాణ విమోచన చరిత్రను తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బండి బాబు, జనరల్ సెక్రటరీ ఎండిగా రాజు, మండల కార్యదర్శి పోతరాజు సంపత్, బయ్య రాజేందర్, గుగులోత్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై దాడి వ్యాఖ్యలు ఖండించిన మహమ్మద్ జానిమియా

**- బల్మూర్ వెంకట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**



**ములుగు ప్రతినిధి సెప్టెంబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై దాడి చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మహమ్మద్ జానిమియా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ జోలికి వస్తే సహించేది లేదని, రాజకీయంగా విమర్శలు చేయాలే తప్ప వ్యక్తిగత దూషణలు, దాడుల గురించి మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. అసెంబ్లీలో విధానపరంగా మాట్లాడి ప్రజల సమస్యలపై పోరాడాల్సిన ప్రజాప్రతినిధులు దాడులు చేస్తామంటూ హెచ్చరికలు చేయడం ఆందోళనకరమన్నారు. కేటీఆర్ ఒక్క వ్యక్తి మాత్రమే కాదని, తెలంగాణలోని యువతకు ఆయన ఒక గొంతుకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై అనేక అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. గతంలో కూడా కేటీఆర్‌పై డ్రగ్స్‌కు సంబంధించి ఆధారాలు లేని ఆరోపణలు చేసిన బల్మూర్ వెంకట్, ఇప్పుడు దాడి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టేందుకు బెదిరింపులకు పాల్పడటం మానుకోవాలని, ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవిస్తూ రాజకీయంగా పోరాడాలని హితవు పలికారు. కేటీఆర్ భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, బల్మూర్ వెంకట్ చేసిన వ్యాఖ్యలపై పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డీజీపీని మహమ్మద్ జానిమియా డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతమైన భాషను ఉపయోగిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు.

# సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి..

**- తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ..**

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు సాగిన ఈ బైక్ ర్యాలీలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మహేందర్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన సెప్టెంబర్




17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారి పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ చౌక్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. అనంతరం నాయకులు, కార్యకర్తలు జిల్లా అడిషనల్



కలెక్టర్‌ను కలిసి సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, నగర నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, యువతతో పాటు వేలాది మంది బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

# సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్ల ప్రదానం**

**ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ అభ్యర్థులకు అవకాశం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో డిప్లొమా, పీజీ సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ కోసం తెలంగాణ వ్యాప్తంగా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు, డిగ్రీ, పీజీ,



పాలిటెక్నిక్ డిప్లొమా, ఇంజనీరింగ్ చదువుతున్న లేదా పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్‌డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్,పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్,మాస్టర్ ప్రోగ్రామ్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్, తదితర కోర్సుల్లో శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. శిక్షణ కాలపరిమితి 5 నుంచి 10 నెలల వరకు ఉంటుందని, కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన వారికి భారత ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేస్తామని సంస్థ పేర్కొంది. ప్రస్తుతం ఐటీ, సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, ఈ-కామర్స్ రంగాల్లో సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, పెనెట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్ వంటి విభాగాల్లో దేశ, విదేశాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని డైరెక్టర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి www.nationalcybersecurityacademy.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని లేదా మరిన్ని వివరాలకు 7893141797 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

# ట్రంక్‌లో స్పానర్ ఉందనే ఆరోపణతో విద్యార్థినిపై టీచర్ దాడి

**కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల క్యాంపస్-2లో విద్యార్థినిపై ఉపాధ్యాయుడు దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ట్రంక్‌లో స్పానర్ ఉందనే కారణంతో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థినిని గణిత ఉపాధ్యాయుడు కొట్టినట్లు సమాచారం. వివరాల ప్రకారం ఆరో తరగతి విద్యార్థిని డి. సాన్విత ట్రంక్‌లో స్పానర్ ఉన్నట్లు గుర్తించిన అనంతరం ఉపాధ్యాయుడు ఆమెను ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ క్రమంలో విద్యార్థినిపై చేయి చేసుకోవడంతో ఆమె శరీరంపై గాయాల గుర్తులు ఏర్పడినట్లు సమాచారం. స్కూల్ నుంచి ఇంటికి చేరుకున్న విద్యార్థిని జరిగిన విషయాన్ని తల్లికి వివరించింది. కుమార్తె శరీరంపై గాయాలను గమనించిన తల్లి పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఘటనపై అధికారులు దృష్టి సారించి విచారణ చేపట్టారు. విద్యార్థిని ట్రంక్‌లో స్పానర్ ఉన్న విషయం ప్రాథమికంగా వెలుగులోకి వచ్చినప్పటికీ, విద్యార్థినిపై దాడి చేయాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందనే అంశంపై పూర్తిస్థాయి విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి. మంగళవారం విద్యార్థిని తల్లిదండ్రుల సమక్షంలో మరింత విచారణ నిర్వహించి, వాస్తవాల ఆధారంగా తగిన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.



# అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు..

**కరీంనగర్, సెప్టెంబర్ 15(పిసి డబ్ల్యూ న్యూస్):** భారతదేశ ప్రముఖ ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137-ూా, కరీంనగర్ ఆధ్వర్యంలో స్థానిక ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. వాసుదేవా హాస్పిటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, అల్లాడి ఆనంద్ కుమార్, శ్రీరాముల శ్రీనివాస్లను శాలువా, మెమంటో మరియు వాచ్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ముఖ్యంగా హైడ్రాలిక్ డ్యామ్ గేట్ల రూపకల్పనలో ఆయన ప్రతిభను, హైదరాబాద్‌లో మూసీ నది వరదల నివారణకు ఆయన అందించిన ఇంజనీరింగ్ పరిష్కారాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-2 సాగర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ూా పుల్లాల శ్యామ్, ఎల్ఐసి ఎగ్జిక్యూటివ్ రత్నమాల అలాగే సిద్దిపేట ఋూా సదన్ కుమార్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిలిపారు.




# గాంధీభవన్లో శాలువాతో ఘన సన్మానం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మహేష్ కుమార్ గౌడ్ కృషికి ప్రశంసలు

**● రెండేళ్ల పదవీకాలం పూర్తి తీసుకుని సందర్భంగా అభినందనలు**




**ఉప్పల్ సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ రెండేళ్ల పదవి కాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చార్మినార్ ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్, న్యాయవాది దర్శనం వినోద్ గాంధీభవన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శనం వినోద్ మహేష్ కుమార్ గౌడ్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంలో, కార్యకర్తలను సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంలో టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న కృషిని వినోద్ అభినందించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ ప్రజల విశ్వాసాన్ని మరింతగా చూరగొనాలని ఆకాంక్షించారు. మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో టీపీసీసీ బలమైన శక్తిగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమే రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి విజయ ఢంకా మ్రోగిస్తుందని ఈ సందర్భంగా వినోద్ కుమార్ అన్నారు.

# పెంటా రెడ్డి కాలనీలో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

**● కమిటీ చైర్మన్ తలారి మధు సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు**

**● శాలువాలతో అతిథులకు సత్కారం.. భారీగా పాల్గొన్న కాలనీవాసులు**



**ఉప్పల్ సెప్టెంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** పెంటా రెడ్డి కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ తలారి మధు సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మేడ్చల్ కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు కిషోర్ గౌడ్, చెంగిచెర్ల కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి, 28వ వార్డు మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహ హాజరయ్యారు. వారిని ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కనకయ్య, వైస్ చైర్మన్ ముత్యమాచారి, రామకృష్ణ రాజు, సంపత్ రెడ్డి, టీవీఎస్ఎస్ ప్రసాద్, డీఎల్ గిరి, అజయ్, అరుణ్ తదితరులతో పాటు కాలనీవాసులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు

**● సుపోషిత బాలికలే -రేపటి శక్తివంతమైన మహిళలు: పేరువంచ సెక్టార్ సూపర్ వైజర్ భవాని**



**కల్లూరు, సెప్టెంబర్15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సెప్టెంబర్ 9 నుండి సెప్టెంబర్ 30 వరకు జరుగు పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పేరువంచ సెక్టార్ పరిధిలోని టివిఆర్ క్రాస్ రోడ్ రోడ్, శ్రీరాంపురం అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెక్టర్ సూపర్వైజర్ భవాని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుపోషణ బాలికలే రేపటి శక్తివంతమైన మహిళలని అన్నారు. గర్భిణి స్త్రీలు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం , అంగన్వాడి కేంద్రంలో ప్రీస్కూల్ పిల్లలకు, గర్భిణీ బాలింతలకు అందించే హాట్ కూక్కుడ్ మీల్ గురించి అవగాహన కల్పించారు. పోషక పదార్థాల ప్రదర్శన, ప్రీస్కూల్ మెటీరియల్ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతాలు, మూడు సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, అంగన్వాడి టీచర్లు ఖమ్మంపాటి రాణి, తాళ్ల లిల్లీ జానీ, ఆశా కార్యకర్త సునీత, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.


# తెలంగాణ రక్షణ సేన సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తేజా చౌదరి

**- నియామక పత్రం అందజేసిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్, సెప్టెంబర్ 15(పి సి డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రక్షణ సేన సోషల్ మీడియా అండ్ డిజిటల్ మీడియా విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా హిమాయత్‌నగర్‌కు చెందిన తేజా చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తేజా చౌదరి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలు, భావజాలాన్ని సోషల్ మీడియా, డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు పూర్తి అంకితభావం, నిజాయితీతో పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తూ, డిజిటల్ వేదికలపై తెలంగాణ రక్షణ సేన స్వరాన్ని బలంగా వినిపిస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కె. కవితకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# వేయిస్తంభాల గుడిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



**హనుమకొండ:సెప్టెంబర్ 15(పిసి డబ్ల్యూ న్యూస్):** చారిత్రక వేయిస్తంభాల గుడి (రుద్రేశ్వరస్వామి దేవాలయం)లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కుమారి శివాక్షి వలుస ప్రప్రథమ కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కూచిపూడి నృత్యకారిణి కుమారి హిమాన్సి కాట్రగడ్డ మార్గదర్శకత్వంలో ఈ ప్రదర్శన జరిగింది. హనుమకొండ కేంద్రంగా హిమాన్సి కాట్రగడ్డ నిర్వహిస్తున్న 'ది టెంపుల్ డాన్స్' నృత్యాలయం ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. భక్తులు, కళాభిమానులు నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.

# కన్నూర్ గ్రామంలో మెగా ఉచిత పశు వైద్య శిబిరం

### పశు సంపదపై నిర్లక్ష్యం వద్దు: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీ రాణి



**కమలాపూర్, సెప్టెంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని కన్నూర్ గ్రామంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో మెగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీ రాణి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పేరాల సంపత్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగం ఆధునిక యాంత్రీకరణ వైపు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైతులు పశుసంపదను నిర్లక్ష్యం చేయకుండా పాడి పరిశ్రమపై కూడా దృష్టి సారించాలని సూచించారు. పశువుల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు పశువుల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువులు తయారు చేసుకుని రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. తద్వారా భూసారం కాపాడుతూ అధిక పంట దిగుబడులు సాధించే అవకాశం ఉందని తెలిపారు.శిబిరంలో పశువైద్య అధికారులు గ్రామంలోని పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన టీకాలు, నట్టల నివారణ మందుల గోళీలను పంపిణీ చేశారు. పాడి రైతులకు పశువుల సంరక్షణ, వ్యాధుల నివారణ, పోషకాహారం తదితర అంశాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కన్నూర్ గ్రామ సర్పంచ్ పుల్లూరి శోభారాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, మార్కెటింగ్ కార్యదర్శి జన్ను యాకయ్య, ఉప్పల్ పశువైద్యాధికారి ప్లవన్ మజుందార్, కన్నూర్ ఉప సర్పంచ్ ఇనుగాల రాజు, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పుల్లూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ వీరమనేని భాస్కరరావు, డైరెక్టర్లు వంటకాల అనిల్ రెడ్డి, సముద్రాల కృష్ణ, జనగాని శివకృష్ణ, గట్టు శ్రీధర్, ఉరుసు తిరుపతి, అక్కినపల్లి బిక్షపతి, కిన్నెర కృష్ణమూర్తి, మిల్కురి శ్రీనివాస్, వెటర్నరీ, మార్కెటింగ్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లాని సురేష్, పల్లె సంతోష్, అబ్బరవేణి అనిల్, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# కల్వకుంట్ల సందీప్‌కు టీఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు

- తెలంగాణ రక్షణ సేనలో కీలక బాధ్యతలు అప్పగింత
- డిజిటల్ వేదికగా పార్టీని మరింత బలోపేతం చేస్తానన్న కల్వకుంట్ల సందీప్



**హైదరాబాద్ సెప్టెంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** టీఆర్ఎస్ పార్టీకి చెందిన కల్వకుంట్ల సందీప్‌కు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర స్థాయిలో సోషల్ మీడియా & డిజిటల్ మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా తనకు అప్పగించిన బాధ్యతపై సంతోషం, గౌరవాన్ని వ్యక్తం చేశారు.ఈ బాధ్యతను తనపై విశ్వాసంతో అప్పగించిన కవితక్కకు కల్వకుంట్ల సందీప్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తానని పేర్కొన్నారు.తెలంగాణ వ్యాప్తంగా సంస్థ డిజిటల్ ప్రస్థానాన్ని మరింత విస్తరించడంతో పాటు, సోషల్ మీడియా వేదికల ద్వారా పార్టీ కార్యక్రమాలు, విధానాలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సంస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని సందీప్ స్పష్టం చేశారు.జై టీఆర్ఎస్.. జై తెలంగాణ.. జై కవితక్క అంటూ ఆయన తన అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకే డబ్ల్యూజేఐ: హనుమండ్ల రామకృష్ణారెడ్డి

### మండల డబ్ల్యూజెఐ నూతన ఏకగ్రీవ కమిటీ ఎన్నిక
### అధ్యక్షులు గుల్లపెల్లి సదానందం
### ప్రధానకార్యదర్శి కుమ్మరి రామ్మూర్తి



**పెద్దవంగర సెప్టెంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జర్నలిస్టుల ఐక్యత, వారి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) నిరంతరం రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అడహాక్ కన్వీనర్ హనుమండ్ల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పెద్దవంగర మండల కేంద్రంలో డబ్ల్యూజేఐ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నుకున్నట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. మండల అధ్యక్షుడిగా గుళ్ళపల్లి సదానందం, ఉపాధ్యక్షుడిగా రాయారవు రాజు, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి రామ్మూర్తి , కోశాధికారిగా తాళ్ళపల్లి మల్లేష్, సహాయ కార్యదర్శిగా సుధా గాని యాకయ్య, సభ్యులుగా అంకం తులసి వేణు, ఎరుకుల సమ్మయ్య, పొనుగోడు బాలాజీ ఎన్నికయ్యారు. అనంతరం మండల అధ్యక్షుడిగా గుల్లపల్లి సదానందం,ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి రామ్మూర్తి లను జిల్లా అడహాక్ కన్వీనర్ హనుమండ్ల రామకృష్ణారెడ్డి సభ్యులతో కలిసి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా అడహాక్ కన్వీనర్ హనుమండ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హెల్త్ కార్డులు, ఫీజు రాయితీలు అర్హులైన ప్రతి పాత్రికేయుడికి అందేలా తమ సంఘం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి సంఘటితంగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో ఉపాధ్యక్షులు తోకల రామచందర్ , కో కన్వీనర్ కొండి సాయికిరణ్ నేత, నల్ల జగన్ రెడ్డి మండల నాయకులు రాయరావు రాజు. మల్లేష్. పానుగోత్ బాలాజీ. సుదగాని యాకయ్య. పాల్గొన్నారు.

# రామన్నపేట మండలంలో పెరిగిన విద్యార్థుల నమోదు



**రామన్నపేట,సెప్టెంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రామన్నపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గత ఏడాదితో పోలిస్తే పెరిగింది. 2025-26 విద్యా సంవత్సరంలో 2369 మంది విద్యార్థులు ఉండగా, 2026-27 విద్యా సంవత్సరంలో 2442 మందికి చేరింది. మొత్తం 73 మంది విద్యార్థులు పెరిగినట్లు విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో వెల్లడైంది.మండలంలో మొత్తం 42 పాఠశాలలు ఉండగా, అందులో అత్యధికంగా ఎంపీ యుపిఎస్ శోభనాద్రిపురం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 17 నుండి 68కి పెరిగింది. జెడ్ పి హెచ్ ఎస్ ఇంద్రపాలనగరం లో 122 నుండి 159కి, ఎంపీపీ ఎస్ వెల్లంకి లో 154 నుండి 170కి పెరిగింది.ఎంపీ పిఎస్ కక్కిరేణి లో 101 నుండి 115కి, ఎంపీపీ ఎస్ ఎన్నారం లో 53 నుండి 67కి, ఎంపీ పిఎస్ మునిపంపుల లో 56 నుండి 68కి విద్యార్థుల సంఖ్య పెరిగింది.అత్యధిక విద్యార్థులున్న పాఠశాలగా పిఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ వెల్లంకి(173 మంది) నిలిచింది. ఆ తర్వాత ఎంపీపీ ఎస్ వెల్లంకి (170), జెడ్పిహెచ్ఎస్ ఇంద్రపాలనగరం (159) ఉన్నాయి.అయితే కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఎంపీ యుపిఎస్ ఇస్కిల్లాలో గతేడాది 198 మంది ఉండగా ఈ ఏడాది 107 మందికి తగ్గింది. ఎంపీ యుపిఎస్ నీర్నెముల లో 61 నుండి 48కి, ఎంపీ యుపీఎస్ పల్లివాడ లో 102 నుండి 91కి తగ్గింది.ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెరగడంతోనే నమోదు పెరిగిందని విద్యాశాఖ అధికారి టి సురేందర్ రెడ్డి తెలిపారు.వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్స్ ఇంకా ఎక్కువగా పెంచుతామని తెలిపారు

# పెద్దవంగర మండల అభివృద్ధిపై అధికారులతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి విస్తృత సమీక్ష

### ప్రజా సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం



**పెద్దవంగర సెప్టెంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దవంగర సెప్టెంబర్ 15 తొలి అక్షరం పెద్దవంగర మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులతో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచులతో, పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై శాఖల వారీగా ఎమ్మెల్యే సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ముఖ్యంగా తాగునీటి సరఫరా, రహదారుల నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, విద్యుత్, విద్య, వైద్య సేవలు, వ్యవసాయానికి సంబంధించిన అంశాలు, సాగునీటి సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.సమావేశంలో ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో ముందుకు సాగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమీక్ష సమావేశంలో మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు ఘనంగా గణపతి పూజ

### - 27 ఏళ్లుగా కొనసాగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు

**చౌటుప్పల్: సెప్టెంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :**చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామం లో భాపూజీ కాలనీ లో ఆజాద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గణపతి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు.ఆజాద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 27 సంవత్సరాలుగా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిరంతరంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ, ఆధ్యాత్మికతతో పాటు యువతలో ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆజాద్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దోర్నాల గజేందర్, గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షులు దోర్నాల ఉదయ్ కుమార్, దోర్నాల నారాయణ, దోర్నాల రాము, దోర్నాల నరేష్, దోర్నాల ప్రభాకర్, దోర్నాల రామకృష్ణ,చెరుకు నరేష్ గౌడ్, బండ్ల మధు యాదవ్, దోర్నాల సురేష్,దోర్నాల సాయిరాం, బుడ్డా శ్యాం, బుడ్డ తేజ,రాపోతు శ్రీకాంత్,కొంతం నరేందర్ రెడ్డి, దోర్నాల అజయ్ కుమార్, రాపోతు నవీన్, మేకల గణేష్ ముదిరాజ్ మరియు సభ్యులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంపాదకీయం




## వివక్ష విహారం


స్వామి వివేకానంద ఆనాడు చికాగోలో జరిగిన ఆధ్యాత్మికుల సభలో ప్రసంగించి అందరినీ అబ్బుర పరిచారని మనందరికీ తెలుసు. సంబోధనలోనే 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్' అని ఒక ఉన్నతమైన పిలుపుతో అందరి మనసులు గెలుచు కున్నాడని విన్నాము. భారతదేశపు గౌరవ మర్యాదలు, సంప్రదాయాలు, విలువల గురించి ఆయన ప్రసంగం ప్రస్ఫురించందని విమర్శకులు అభిప్రాయ పడి, ఆయన్ను కొనియాడారు. అట్లాంటి చరిత్రను చెరిపిరాసేందుకు పూను కుంటున్నాయి నేటి మతవాదుల చర్యలు. భక్తి, ఆరాధన వ్యక్తిగతమైన విషయాలు. అవి ఎలా చేసుకున్నా ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ఇప్పుడు ఏం జరిగింది. ఏం జరుగుతోంది మన దేశ ఉన్నత్యాన్ని దెబ్బతీసే పనులకు మత ప్రచారకులు, ప్రవచనకారులూ ఒడిగడుతున్నారు.మొన్న సెప్టెంబరు 5న ఫ్రాన్స్‌లోని పారిస్ నగరంలో జరిగిన సంఘటన మతవాదుల వివక్షతలను వెల్లడిస్తోంది. వివక్షా పూరిత వీరి ప్రవర్తనకు పారిస్‌లోని ప్రసిద్ధ పర్యటన కట్టడం ఈఫిల్ టవర్‌ను ఒకరోజు మూసేసారు. అసలేం జరిగిం దంటే, బాబ్స్ అనే ఒక హిందూ ధార్మిక సంస్థ (బొచాసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామి నారాయణ్ సంత) సభ్యులు ఒక వంద మంది కాషాయ వస్త్రాలు ధరించి, ఈఫిల్ టవర్ సందర్శనకు వెళ్లారు. అందులో వారి గురువు కూడా ఉన్నాడు. అందరు పర్యటించినట్లే వాళ్లూ పర్యటిస్తే ఇంత చెప్పుకునేవాళ్లం కాదు.ఆ ఈఫిల్ టవర్‌లో వందలాదిమంది ఉద్యోగులు పనిచేస్తారు. అందులో మహిళలూ ఉంటారు. మన హిందూ సాధు సన్యాసులు, అక్కడ మహిళా ఉద్యోగులను వారికి కనపడకుండా తప్పుకోవాలని కోరారు, వారు పనిచేస్తున్న ప్రదేశంలో పురుష ఉద్యోగులను ఉంచాలని, మేము మహిళలను చూడకూడదని వీరి వివక్షాపూరిత ఆచారాన్ని అక్కడ అమలు చేయటానికి సిద్ధపడ్డారు. ఈఫిల్ టవర్ యాజమాన్యం వారి కోరిక మేరకు తప్పుకోవాల్సిందిగా కోరింది. మహిళలను వారు చూస్తే మలిన పడిపోతారని వారి భావం, పాపమై పోతుందనే ఉద్దేశం, అక్కడ మహిళా ఉద్యోగులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఒక విదేశీ గడ్డపైన మన మత ఆచారాలు ఎంత వివక్ష పూరితంగా ఉంటాయో ప్రపంచానికి చాటి చెప్పినట్లయింది. వెంటనే అక్కడ పనిచేస్తున్న ఉద్యోగ సంఘాలు వీరి ప్రవర్తనకు నిరసనగా ఒక రోజు సమ్మెకు దిగడంతో సెప్టెంబరు 7న ఈఫిల్ టవర్ సందర్శనను నిలిపివేశారు. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే, అంతకుముందు రోజు పారిస్‌లో బాబ్స్ అనే సంస్థ నిర్మించిన దేవాలయ ప్రారంభోత్సవానికి మన ప్రధాని మోడీ హాజరయ్యారు. భారత్, ఫ్రాన్స్ సాంస్కృతిక సంబంధానికి ఇదొక ప్రతీక అని, ఈ సంబంధాల బలోపేతానికి కృషి చేయాలని కోరి ఉన్నారు. ఆ వెనువెంటనే ఈ సంఘ టన చోటు చేసుకున్నది.ఉద్యోగులు చేసిన సమ్మెతో ప్రభుత్వం జోక్యం చేసుకుని, జరిగిన దానిపై దర్యాప్తు చేస్తున్నది. టవర్ ఆపరేటింగ్ కంపెనీ పొరపాటు చేసిందని, దేశం అవలంబిస్తున్న సమానత్వ, గణతంత్ర విధానాలకు వ్యతిరేకమైన చర్య ఇదని, లింగ వివక్షతను అనుమతించబోమని ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంఘటనను ఫ్రెంచ్ రాజకీయ నాయకులు, అధికారులు ఖండించారు. ఇంత పెద్ద దుమారం రేగగానే సదరు 'బాబ్స్' సంస్థ క్షమాపణలు కోరింది. ప్రపంచంలో మన ఆచరణ, మహిళల పట్ల వివక్షత, అసమానతలు ఏ విధంగా ఉన్నాయో బహిరంగ పరిచారు. ఇవి మనకు తలవంపులు తెచ్చే విధంగా ఉన్నాయి. స్త్రీల పట్ల మతతత్వవాదులు ఈ దేశంలోనే కాదు, ఇతర దేశాలలోనూ అదే రకమైన ఆచరణ, ఆలోచన కొనసాగుతుంది. దీన్ని ఇప్పుడు కూడా మన దేశంలోని మతవాదులు కానీ, పరిపాలిస్తున్న నాయకులు కానీ ఖండించరు. వీరి మత ఛాందస విధానాలు, మన దేశంలో కులపరంగానూ దుర్మార్గమైన వివక్షతలను పాటిస్తున్నారు.వాళ్లూ సనాతనవాదం గురించి మాట్లాడుతున్నారు. మహిళలను చిన్నచూపు చూసిన బాబ్స్ సంస్థ 18 శతాబ్దం నుండే పనిచేస్తున్నది. గుళ్లలోకి మహిళలను రానియ్యని ఆచరణ వాళ్లది. ఇలాంటి ప్రచారకులకు, బోధకులకు మన విశ్వగురువు నాయకుడు. ఆధునిక ప్రజాస్వామిక, లౌకిక విధా నాలకు పూర్తి విరుద్ధమైన ఆలోచనలతో నడుస్తున్న తీరును చూసి ప్రపంచమంతా నవ్వుతున్నది. ప్రపంచంలోనే మొట్ట మొదటి రాజకీయ విప్లవం సాధించిన 'పారిస్ కమ్యూన్'లో మహిళలు స్వేచ్ఛ కోసం వీరోచితంగా పోరాడిన నేలలో లింగ వివక్షతలకు పాల్పడడం క్షమించరాని నేరం. చైతన్యయుతమైన అక్కడి మహిళలు తమ ప్రతిఘటనను ప్రదర్శించారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలకేదీ పరిష్కారం



విద్యుత్ ఉద్యోగుల పని స్వభావాన్ని ఇతర ప్రభుత్వ ఉద్యో గాలతో సాధారణంగా పోల్చడం సమంజసం కాదు. విద్యుత్ లైన్లపై, సబ్‌స్టేషన్లలో, పవర్ ప్లాంట్లలో, తుఫాన్లు, భారీ వర్షాలు, ఎండలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా వారు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతి సంవత్స రం విద్యుత్ ప్రమాదాల్లో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆందోళ న కలిగిస్తున్నాయి. భద్రతా ప్రమాణాలు, తగినంత సిబ్బంది, శిక్షణ, రక్షణ పరికరాలు, సరైన పని విధానాలు లేకపోతే ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతుంది.తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి రంగానికే తలమానికంగా చెప్పుకోదగిన యాదాద్రి సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్ హ్యాండ్లింగ్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే ప్రతిపాదనలు, విద్యుత్ రంగంలోని భాగస్వామ్య పక్షాలకు ఏమాత్రం ప్రయోజనకారి కాని 'రైతు డిస్కం' ఏర్పాటు దిశగా అడుగులు, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రావాల్సిన వేతన సవరణ ప్రక్రియలో ఆలస్యం, క్షేత్రస్థాయిలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం వంటి సుమారు 14 ప్రధాన అంశాలపై తెలంగాణ విద్యుత్ ఉద్యోగ సంఘాలు గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నాయి. విద్యుత్ సంస్థల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక అయోమయ పరిస్థితి నెలకొన్నదనే ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. పరిపాలనా సౌలభ్యం, ఆర్థిక పరిపుష్టి, జవాబుదారీతనం, మెరుగైన విద్యుత్ సేవలు వంటి లక్ష్యాలతో కొన్ని సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి. ఎపిఎస్ఇబి విభజన సమయంలో ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వం, విద్యుత్ సంస్థల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కూడా జరిగింది. ఉద్యోగుల భద్రత, పెన్షన్లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ప్రమోషన్లు, వేతన సవరణ తదితర అంశాలకు ఈ ఒప్పందంలో రక్షణ కల్పించబడింది.

# తెలంగాణను 'తెర్లు' కానియ్యొద్దు




ప్రజాస్వామ్యంలో చట్టసభలు అత్యున్నత చర్చావేదికలు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ప్రజాసమస్యల మీద చర్చ జరిపి, ప్రభుత్వాన్ని నిలదీసి, సరైన, ప్రజలకు ఉపయోగకరమైన విధానాలకు దిశానిర్దేశం చేసే పవిత్ర వేదికలుగా అవి గతంలో గుర్తింపు పొందాయి. ఒకప్పుడు చట్టసభల్లో జరిగే వాదనల్లో తీవ్రత ఉన్నా, భాషలో సంయమనం, భావవ్యక్తీకరణలో హుందాతనం, వేషధారణలో గౌరవం కనిపించేవి. కానీ ఇటీవలికాలంలో దేశవ్యాప్తంగా ప్రజలు ఎన్నుకునే ప్రజాప్రతినిధులు చట్టసభల్లోనూ బయటా కూడా సంస్కారహీనమయిన భాష ఉపయోగించడం చాలా మామూలు అయిపోయింది. అనేక చట్టసభల్లో ఈ విలువలు క్రమంగా దిగజారుతున్నాయనే విమర్శలు పెరుగుతున్నాయి. చట్టసభల్లో జరిగే చర్చలకు సంబంధించిన వివరాలను ప్రజలకు చేరవేసే బాధ్యత నిర్వర్తించే మీడియా కూడా పూర్తిగా దిగజారిపోయిన పరిస్థితి ఇవాళ మనకు కనిపిస్తున్నది. చట్టసభల్లో జరిగే కార్యకలాపాల నుండి, వాటిని ప్రజలకు చేరవేసే మీడియా నుండి రేపటి పౌరులు ఏం నేర్చుకోవాలిఒకప్పుడు చట్టసభల్లో అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా సభా సాంప్రదాయాలకు భిన్నంగా ఒక్క మాట ఉచ్చరించినా దానిమీద చాలా చర్చ జరిగేది. చివరికి బాధ్యుడైన సభ్యుడు, ఏ స్థాయి వ్యక్తి అయినా సభకు క్షమాపణ చెప్పి ఆ మాటను వెనక్కు తీసుకున్న సందర్భాలు అనేకం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహామహులు మన ముఖ్యమంత్రులుగా, సభాపతులుగా వ్యవహరించిన సందర్భాలలో సభలో ఎప్పుడైనా అపసవ్య ధోరణి తలెత్తితే దానిమీద ప్రత్యేక చర్చపెట్టి పరిస్థితిని సరిచేసిన సందర్భాలు అనేకం. ఎన్‌టి రామారావు, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వంటి ప్రజాదరణ కలిగిన నాయకులు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు శాసనసభలో వారు అనుకోకుండా చేసిన వ్యాఖ్యలపట్ల అభ్యంతరాలు వ్యక్తం అయినప్పుడు వివరణ ఇచ్చుకున్న సందర్భాలు, తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్న సందర్భాలూ చూసాం. బయట సమాజంలో అత్యంత ఉద్రిక్త వాతావరణం నెలకొని ఉన్న సందర్భాలలోనూ శాసనసభ సమావేశాలు మాత్రం అత్యంత సంయమనంతో సాగిన పరిస్థితులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చూసాం. ఎక్కడైనా సంయమనం కోల్పోయి సభ్యులు అపసవ్యంగా ప్రవర్తించినా, సభాసంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించినా వాటిని చర్చించి సరిచేసిన సందర్భాలే అనేకం. సభలో ఒక పదం ఉచ్చరించడం సబబా కాదా అన్న విషయమై గంటల తరబడి చర్చలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి.రాజకీయపక్షాల మధ్య విభేదాలు సహజం. అవి సిద్ధాంతపరమయినవి, ప్రజాసంక్షేమమూ, అభివృద్ధి కోసం పనిచేసే క్రమంలో రూపొందించే విధానాలపరమయినవీ అయితే మంచిదే. అయితే ఇటీవల వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు, అసభ్య పదజాలం తరచూ వినిపించడం ఆందోళన కలిగిస్తున్నది. నిన్నటితో ముగిసిన తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు మన చట్టసభల వ్యవహారశైలి ఎంత దిగజారిపోతున్నదో స్పష్టం చేసినట్టు అయింది. తెలంగాణ శాసనసభలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) సభ్యుల మధ్య జరిగిన వాగ్వాదాలు పలుమార్లు సభా కార్యక్రమాలను స్తంభింపజేశాయి. స్పీకర్ వ్యవహారశైలిపై విమర్శలు, సభాపతి పీఠాన్ని లక్ష్యంగా చేసుకున్న వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. అధికార, ప్రతిపక్షాలు పరస్పరం ఒకరిపైఒకరు కేసులు పెట్టుకునేవరకు పరిస్థితి వెళ్లింది. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన సభ రాజకీయ ఆరోపణలకు వేదికగా మారిందనే విమర్శలు వినిపించాయి. అన్నింటికీ మించి, నిమిషానికి కొన్ని లక్షల రూపాయల ప్రజాధనం వ్యయమయ్యే చట్టసభల సమయాన్ని వృథా చెయ్యడం కూడా క్షమార్హం కాదు.విమర్శ అంటే వాస్తవాలను ఆధారంగా చేసుకుని ప్రభుత్వం లేదా ప్రతిపక్షాన్ని ప్రశ్నించడం. కానీ ఇప్పుడు భావవ్యక్తీకరణలో ఆగ్రహం, వ్యంగ్యం, వ్యక్తిగత లక్ష్యసాధన ఎక్కువగా కనిపిస్తున్నది. సభలో మైక్‌లు విరగ్గొట్టడం, కాగితాలు చింపడం, పోడియంను చుట్టుముట్టడం, స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలపడం వంటి ఘటనలు సాధారణమవుతున్నాయి. కొన్నిసార్లు సభలో నినాదాలు, పోస్టర్లు ప్రదర్శించడం కూడా జరుగుతున్నది. చట్టసభల్లో నినాదాలు రాసిన అట్టలను ప్రదర్శించడం నియమాలకు విరుద్ధం. ఒకప్పుడు శాసనసభలో వార్తాపత్రికల్లో వచ్చిన వార్తలను చదివి సభకు వినిపించడాన్ని కూడా అనుమతించేవారు కాదు. ఇప్పుడు అటువంటి నియమాలన్నీ గాలికి ఎగిరిపోయాయి. నినాదాలు రాసిన నల్ల అంగీలు వేసుకుని సభలోకి రాకూడదంటే అవి విప్పేసి లోదుస్తులతో సభలోకి వెళతామని భీష్మించుకుని కూర్చోవడం ఎంతటి ఆవేశంలో అయినా పొరపాటు చర్యే. సభాపతి దళితుడా, అగ్రకులస్థుడా అనేది అలా ఉంచితే కులంతో సంబంధం లేకుండా ఆయన సభాపతి అన్న స్పృహ కోల్పోయి సభ్యులు దుర్భాషలాడటం ఎలా సమర్థనీయం అవుతుంది రాజకీయాలలో కులప్రస్తావన ఎంతమాత్రం సమ ర్థనీయం కాదు. దళితుడు అయినందుకే సభాపతిని దూషించారని అధికారపక్షం అదే వర్గానికి చెంది నవారితో ప్రతిపక్ష నాయకుడి ఫామ్ హౌస్ ముందు చావు డప్పు కొట్టించడం, అలా డప్పు కొట్టినచోట తరువాత ప్రతిపక్షం వారు పసుపునీళ్ళు చల్లి శుద్ధి చెయ్యడం.. ఈ చర్యలన్నీ అనాగరిక, ఆటవిక సంస్కృతిని గుర్తు చేస్తున్నాయి.ప్రతిపక్షానికి చెందిన ఒక సీనియర్ నేత, భవిష్యత్తులో ముఖ్యమంత్రి కావడానికి అన్ని అర్హతలూ కలిగిన నాయకుడు, ఇక్కడ ఉపయోగించడానికి సంస్కారం అడ్డు వస్తున్న భాషలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిడితే దాన్ని యథాతథంగా పతాక శీర్షికలలో ప్రచురించిన పత్రికలూ, ప్రసారం చేసిన న్యూస్ చానళ్ళను ఏమనాలి ఒకప్పుడు మీడియా వెర్రితలలు వేయని రోజుల్లో అటువంటి పరుష పదజాలం ఎవరయినా వాడినా తమ పత్రికలలో దాన్ని యథాతథంగా ప్రచురించకుండా 'ఉచ్చరించలేని భాషలో దూషించారు' అని రాసేవి. ఇప్పుడా సంయమనం రాజకీయ నాయకులలో, మీడియాలో ఎందుకు నశించింది ఎంత దిగజారుడు భాష వాడితే ప్రజల్లో అంత ప్రఖ్యాతి గడించగలమని రాజకీయ నాయకులు, అది యథాతథంగా ప్రచురిస్తే, ప్రసారం చేస్తే పాఠకులు, వీక్షకుల్లో పలుకుబడి పెరుగుతుందని మీడియా అనుకుంటూ ఉండవచ్చు. ప్రజలు ఈ ధోరణిని మెచ్చరు.. ఈసడించుకుంటున్నారని గ్రహిస్తే మంచిది. రాజకీయాలు ఎంతగా దిగజారి, విద్వేషపూరితమయ్యాయో చెప్పడానికి ఒక అధికారపక్షం శాసనసభ్యుడు చేసిన వ్యాఖ్య తాజా ఉదాహరణ. షాద్‌నగర్ శాసనసభ్యుడు 'మాజీ ముఖ్యమంత్రి చావుకు కోరుకుంటున్నాను' అన్నారు. చట్టసభలకు ఎన్నికయి వచ్చేవారంతా విజ్ఞులే అయి ఉంటారని, ఉండాలనీ అనుకోలేం కానీ ఒక మనిషి చావు కోరుకునేంత ద్వేషం ఎందుకంటూ తమ సభ్యుడిని ఒక్క అధికారపక్షం నాయకుడయినా మందలించిన పాపానపోకపోవడానికి మించిన దుర్మార్గం ఉంటుందాశాసనసభ్యుల ప్రవర్తనలో మార్పులకు సోషల్ మీడియా కూడా ఒక కారణంగా కనిపిస్తున్నది. సభలో చేసిన ఘాటైన వ్యాఖ్యలు వెంటనే వైరల్ అవుతుండటంతో, కొందరు నాయకులు చర్చకంటే ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని నిమిషాల నిడివిగల వీడియో క్లిప్‌లు రాజకీయ ప్రచారసాధనాలుగా మారడంతో సంచలన వ్యాఖ్యలకు ప్రోత్సాహం ఎక్కువ అవుతున్నది. దీంతో శాసనసభ చర్చల నాణ్యతకంటే వైరల్ అయ్యే మాటలకే ఎక్కువ ప్రాధాన్యం దక్కుతోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.శాసనసభలు సమాజానికి ఆదర్శంగా ఉండాలి. అక్కడ జరిగే చర్చలను విద్యార్థులు, యువత, ప్రజలు గమనిస్తుంటారు. అలాంటి వేదికలో అసభ్య భాష, వ్యక్తిగత దూషణలు, అరుపులు, గందరగోళం కనిపిస్తే ప్రజాస్వామ్య సంస్కృతిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు సమస్యలకు పరిష్కారాలు చూపాలని ఆశిస్తారు. కానీ సభలు తరచూ వాయిదాపడటం, చర్చలు మధ్యలో నిలిచిపోవడంవల్ల ప్రజా సమస్యలు వెనుకబడుతున్నాయనే భావన పెరుగుతున్నది. విలువలను పునరుద్ధరించాలంటే శాసనసభల గౌరవాన్ని కాపాడేందుకు కచ్చితమయిన చర్యలు ఉండాలి. సభ్యులకు సభాప్రవర్తనపై క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వాలి. అసభ్య పదజాలంపై కఠినచర్యలు తీసుకోవాలి. స్పీకర్ నిర్ణయాలకు అన్ని పార్టీలూ గౌరవం ఇవ్వాలి. ప్రజాసమస్యలపై ఎక్కువ సమయం కేటాయించి వ్యక్తిగత విమర్శలను తగ్గిం చాలి. సభానియమావళిని కచ్చితంగా అమలు చేయాలి.

# ఆదివాసులను ఆదుకోవాలి



ఆదివాసుల జీవన విధానం పర్యావరణం, అడవులు, అక్కడ ఉండే సహజ వనరులు మొదలైన వాటితో ముడిపడి ఉన్నది. కానీ నవీన సమాజం వారి హక్కుల నుండి దూరం చేసే సంక్షోభం నుండి వీరిని రక్షించాల్సిన అనివార్యత ఎంతైనా ఉంది. ఇప్పటికే 1994లో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించడం జరిగింది. కానీ అదిమ జనుల హక్కులు, వాటి రక్షణే ధ్యేయంగా, ఆదివాసీల హక్కుల రక్షణకు, వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ ఐక్యరాజ్యసమితి స్థానిక ప్రజలపై కొనసాగుతున్న హింస, దుర్వినియోగం మీద 'యునైటెడ్ నేషన్స్ డిక్లరేషన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ఇండిజినస్ పీపుల్స్' 2006, జూన్ 29న మానవహక్కుల కౌన్సిల్ ఆదివాసీల హక్కుల రక్షణకై ఒక తీర్మానం జరగాలని సూచించింది. అప్పుడు మానవ హక్కుల కౌన్సిల్, యుఎన్ఓ లు కలిసి ఆదివాసీల హక్కుల రక్షణకు తీర్మానించాయి. ఈ తీర్మానం 61/295 ప్రకారం జనరల్ అసెంబ్లీ 2007 సదస్సులో ప్రతి ఏటా సెప్టెంబర్ 13 తేదీని ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ హక్కుల దినంగా జరుపుకోవాలని ప్రకటించింది. దీనిని వర్కింగ్ గ్రూప్ సమావేశంలో చర్చించి అదివాసుల హక్కులు, భాషలు, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆదివాసీలు వివక్ష నుండి స్వతంత్రత పొంది శాశ్వతంగా స్వేచ్ఛ పొందడా నికి అమలు చేయాల్సిన ముఖ్య అంశాలను వెల్లడించింది.యుఎన్ఓ 1982లో ప్రపంచంలోని ఆదివాసీలను విశ్వమానవులుగా గుర్తించినపుడు, వారికున్న ప్రత్యేక హక్కులను రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ఈ హక్కుల దినోత్సవం గుర్తుచేస్తుంది. ఈ కమిటీ గుర్తించిన ముఖ్యమైన అంశాలు రాజకీయ. సామాజిక, ఆర్థిక సాధికారత, సంస్కృతి, సాంప్రదాయాలు, చరిత్ర, వేదాంత శాస్త్రం, వారసత్వ భూమి హక్కులు, స్థానిక వనరులు, అలాగే అన్ని రకాల వివక్షలు మొదలైన వారి హక్కులను రక్షించాల్సిన అవసరం ఉందని, వాటిని గౌరవిస్తూ ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని ఆ సమావేశంలో తీర్మానించిన అంశాలను వెల్లడించిన అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్‌ను అనుసరిస్తూ సెప్టెంబర్ 13ను అంతర్జాతీయ ఆదివాసీ హక్కుల దినోత్సవంగా గుర్తించడం జరిగింది. ఈ డిక్లరేషన్‌లో మొత్తం 46 ప్రకరణలు పొందుపరిచారు.ఈ 46 ప్రకరణలలో ముఖ్యమైనవి మచ్చుకు కొన్ని. అధికరణ (1) ప్రపంచ మానవ హక్కుల చట్టం ప్రకారం, ఆదివాసీలు స్వేచ్ఛగా మానవహక్కులు, ప్రాథమిక హక్కులను కలిగి వాటిని ఆనందంగా అనుభవించాలి. ఎటువంటి వివక్షకు గురికావద్దు. అధికరణ (2): ఆదివాసీలు ఎటువంటి వివక్ష లేకుండా ఇతరులతోపాటు సమానంగా హక్కులను అనుభవించాలి. అధికరణ (3): ఆదివాసీలు సంకల్పంతో వారి ఇష్ట ప్రకారం, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి తోడ్పడు అంశాలను వారి ఇష్టమైన రీతిలో నిర్వహించుకొని అభివృద్ధి చెందవచ్చు. అధికరణ (4): వీరు స్వయం ప్రతిపత్తి, స్వయం పాలనను వారి అంతరంగిక స్థానిక అంశాలలో నిర్వహించుకోవచ్చు. అదే విధంగా ఆర్థిక వనరులు, సముపార్జనను వారు ఇష్టమైన రీతిలో నిర్వహించుకోవచ్చును. అధికరణ (5): ఆదివాసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, చట్టాలను బలోపేతం చేసుకునే అధికారం కలదు. అధికరణ(6) ప్రతి ఆది వాసీ ఏ దేశంలో నివసిస్తున్నప్పటికీ ఆదేశ పౌర సత్వం పొందే ఉండే హక్కును కలిగి ఉంటాడు. అధికరణ(7); ప్రతి ఆదివాసీ మానసిక సమగ్రతలో జీవితంలో స్వేచ్ఛ, రక్షణ హక్కును కలిగి ఎటువంటి మారణ హటరీ మానికి గురికాకుండా, వ్యక్తిగతంగా, సమూహంగా, రక్షణతో కూడిన శాంతి, రక్షణ కలిగి బలవంతపు చర్యలు వీరి మీద, పిల్లల మీద లేకుండా ఉండే హక్కు అధికరణ(8): జాతిపరంగా రెచ్చగొట్టే చర్యలు, వివక్ష ఉండకూడదు. వారి సంస్కృతి, సాంప్రదాయాలు రక్షణ కలిగి విలువలు కలిగి ఉండాలి.

# ఛాంపియన్ జ్వెరెవ్



## కెరీర్ రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ వశం

## ఫైనల్లో బెన్ షెల్టన్‌పై ఘన విజయం

## యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2026

**న్యూయార్క్ (యుఎస్ఏ) :** యుఎస్ ఓపెన్‌కు కొత్త ఛాంపియన్. మహిళల సింగిల్స్‌లో ఎలెనా రిబకినా తొలిసారి ఛాంపియన్‌గా అవతరించగా, పురుషుల సింగిల్స్‌లోనూ నయా చాంపియన్ వచ్చాడు. టాప్ సీడ్, జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ మెన్స్ సింగిల్స్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో అమెరికా ఆటగాడు, ఎనిమిదో సీడ్ బెన్ షెల్టన్‌పై అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-3, 7-6(7-2), 5-7, 6-2తో ఘన విజయం సాధించాడు. నాలుగు సెట్ల పోరులో అలెగ్జాండర్ జ్వెరెవ్ ఆరంభం నుంచి ఛాంపియన్ ఆటతీరు కనబరిచాడు. తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫైనల్‌కు చేరుకున్న బెన్ షెల్టన్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. కెరీర్ రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన జ్వెరెవ్‌కు.. ఈ ఏడాదిలో ఇది రెండో విజయం. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ విజయంతో జ్వెరెవ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల ఖాతా తెరిచిన సంగతి తెలిసిందే.

**జ్వెరెవ్ జయహో..** గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గని ప్రతిభావంతుడు'గా అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై టెన్నిస్ వర్గాల్లో ఓ ముద్ర పడింది. రోజర్ ఫెడరర్, రాఫెల్ నాదల్, నొవాక్ జకొవిచ్ త్రయం జోరులో పెద్దగా వెలుగులోకి రాని జ్వెరెవ్.. ఆ తర్వాత అల్కరాస్, సినర్ దూకుడుతో వెనుకంజ వేశాడు. ఈ ఏడాది ఏకంగా మూడు గ్రాండ్‌స్లామ్స్‌లో ఫైనల్‌కు చేరిన జ్వెరెవ్ రెండు టైటిల్స్‌తో సత్తా చాటాడు. గతంలో జ్వెరెవ్ మూడు సార్లు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌కు చేరినా.. టైటిల్‌కు అడుగు దూరంలో ఆగిపోయాడు. ఆదివారం న్యూయార్క్‌లో పురుషుల సింగిల్స్ ఫైనల్లో జ్వెరెవ్ ఫేవరేట్‌గా బరిలోకి దిగాడు. ప్రత్యర్థి తొలిసారి ఫైనలిస్ట్ కావటంతో.. జ్వెరెవ్ అనుభవంతో పాటు వరల్డ్ క్లాస్ ఆటతీరుతో పైచేయి సాధించాడు. తొలి సెట్లోనే బ్రేక్ సాధించిన జ్వెరెవ్ 6-3తో ముందంజ వేశాడు. రెండో సెట్లో షెల్టన్ నుంచి ప్రతిఘటన ఎదురైనా.. టైబ్రేకర్‌లో 7-2తో జ్వెరెవ్‌దే పైచేయిగా నిలిచింది. కీలక మూడో సెట్లో షెల్టన్ పుంజుకున్నాడు. జ్వెరెవ్ సర్వ్‌ను బ్రేక్ చేసి 7-5తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. కానీ నాల్గో సెట్లో మరోసారి పైచేయి సాధించిన జ్వెరెవ్ 6-2తో నాల్గో సెట్‌తో పాటు యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ను ఎగరేసుకుపోయాడు. అలెగ్జాండర్ జ్వెరెవ్ 9 ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించగా.. బెన్ షెల్టన్ 10 ఏస్‌లు, ఓ బ్రేక్ పాయింట్‌తో సరిపెట్టుకున్నాడు. పాయింట్ల పరంగా 125-113తో జ్వెరెవ్ ఆధిపత్యం చూపించాడు. జ్వెరెవ్ 24 గేములు గెలుపొందగా, షెల్టన్ 18 గేములే నెగ్గాడు.

**ఛాంపియన్ భావోద్వేగం** యుఎస్ ఓపెన్ టైటిల్ సాధించిన అనంతరం అలెగ్జాండర్ జ్వెరెవ్ భావోద్వేగానికి లోనయ్యా డు. నాలుగేండ్ల వయసులోనే మధుమే హంతో బాధపడుతున్న తనని.. తన తల్లి ఏ విధంగా చాంపియన్‌గా తీర్చిదిద్దిందో జ్వెరెవ్ గుర్తు చేసుకున్నాడు. '4 ఏండ్ల కొడుకు డయాబెటిస్‌తో బాధపడుతున్నాడు. సాధారణ జీవితం, స్పోర్ట్స్ ఆ పిల్లవాడికి ఎంతో పరిమితమని వైద్యులు చెప్పారు. అయినా, నా కొడుకు టెన్నిస్ ప్లేయర్ కావాలని అనుకుంటే, టెన్నిస్ ప్లేయర్ అవుతాడు. జీవితంలో ఇంకేదైనా సాధించాలని అనుకుంటే అదీ సాధిస్తాడు అనే దీమాతో అమ్మ నన్ను పెంచింది. వెన్నంటి నిలిచి టెన్నిస్ ప్లేయర్‌గా, గ్రాండ్‌స్లామ్ చాంపియన్‌గా నిలబెట్టింది' అని జ్వెరెవ్ కన్నీటి పర్యంతమవుతూ తన విజయంలో అమ్మ పాత్రను అభిమానులతో పంచుకున్నాడు.

# సిరీస్ మనదే



## 3 వికెట్లతో మెరిసిన నితీశ్

## అర్థ సెంచరీతో చెలరేగిన సంజు

## రెండో టీ20లో భారత్ ఘన విజయం

## అఫ్గనిస్తాన్ 159/8, భారత్ 163/3

**న్యూఢిల్లీ :** వరుసగా రెండో టీ20లో టీమ్ ఇండియా ఏకపక్ష విజయం నమోదు చేసింది. బంతితో, బ్యాట్‌తో ఎదురులేని ప్రదర్శన కనబరిచిన శ్రేయస్ సేన 7 వికెట్ల తేడాతో అఫ్గనిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. 160 పరుగుల ఛేదనలో ఓపెనర్ సంజు శాంసన్ (57, 22 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. అభిషేక్ శర్మ (39, 19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (38 నాటౌట్, 23 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. 14.5 ఓవర్లలోనే 3 వికెట్లకు భారత్ 163 పరుగులు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గనిస్తాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 159 పరుగులు చేసింది. ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (37, 33 బంతుల్లో 6 ఫోర్లు), రషీద్ ఖాన్ (28, 16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), డార్విశ్ రసూల్ (26, 15 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), మహ్మద్ నబి (20, 14 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) అఫ్గాన్‌కు గౌరవప్రద స్కోరు అందించారు. భారత బౌలర్లలో పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (3/24) మూడు వికెట్లు పడగొట్టగా.. అర్ష్‌దీప్ సింగ్ (2/35), జశ్‌ప్రీత్ బుమ్రా (1/25), అక్షర్ పటేల్ (1/28), రవి బిష్ణోయ్ (1/32) రాణించారు. భారత్, అఫ్గనిస్తాన్ మూడో టీ20 గురువారం ఫిరోజ్ షా కోట్ల స్టేడియంలోనే జరుగనుంది.

# విజేత హైదరాబాద్ గ్లోబ్

## - సీసీఓబీ ఫుట్‌బాల్ కప్




హైదరాబాద్ : సిటీకాలేజ్ ఓల్డ్ బాయ్స్ (సీసీఓబీ) ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీసీఓబీ కప్ (అండర్-21) విజేతగా హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో హైదరాబాద్ స్పోర్టింగ్ ఎఫ్‌సీపై 1-0తో హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ గెలుపొందింది. సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్ 55వ నిమిషంలో గెలుపు గోల్ అందించాడు. అంతకుముందు సెమీఫైనల్లో ఆతిథ్య సీసీఓబీపై 1-0తో, క్వార్టర్‌ఫైనల్లో సైదాబాద్ ఎఫ్‌సీపై 5-0తో హైదరాబాద్ గ్లోబ్ గెలుపొందింది. హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ జట్టును, కోచ్‌లు వహీద్ ఖాన్, సయ్యద్ ఓవైస్ ఉద్దీన్‌లను సీసీఓబీ క్లబ్ అధికారులు అభినందించారు.

# మెరిసిన శాంసన్, నితీశ్.. టీ20 సిరీస్ టీమిండియా వశం..!

మూడు టీ20ల సిరీస్‌లో జోరు చూపిస్తున్న భారత్.. వరసగా రెండో మ్యాచ్‌లోనూ అఫ్గనిస్థాన్‌ను చిత్తు చేసింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో నితీశ్ రెడ్డి(3-35) బంతితో రాణించగా.. ఆపై ఓపెనర్లు అభిషేక్ శర్మ(39) సంజూ శాంసన్(57)లు దంచేశారు. అర్ధ శతకంతో విరుచుకుపడిన సంజూను రషీద్ ఖాన్ బోల్తా కొట్టించినా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ(15 నాటౌట్) సాయంతో ఇషాన్ కిషన్(38 నాటౌట్) లాంఛనం ముగించాడు. ఏడు వికెట్ల విజయంతో సిరీస్‌ను పట్టేసింది టీమిండియా.ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్‌ల నుంచి తేరుకున్న టీమిండియా స్వదేశంలో గర్జించింది. అఫ్గనిస్థాన్‌పై వరసగా రెండు విజయాలతో టీ20ల సిరీస్‌ను గెలుచుకుంది భారత్. తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో నెగ్గిన అయ్యర్ సేన.. ఈసారి వికెట్ల తేడాతో విక్టరీ కొట్టింది. 160 పరుగుల ఛేదనలో ఓపెనర్లు అభిషేక్ శర్మ(39), సంజూ శాంసన్(57) మెరుపు ఆరంభమిచ్చారు. రెండు ఓవర్లలోనే నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 47 రన్స్ పిండుకుందీ ద్వయం.అభిషేక్ ఔటైనా.. తనమార్క్ షాట్లతో అలరించిన శాంసన్ అర్ధ శతకం బాదాడు. అయితే.. రషీద్ ఖాన్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించి సంజూ బౌండరీ వద్దనబీ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి రషీద్ ఓవర్లోనే శ్రేయాస్ అయ్యర్(11)ను డైవింగ్ స్లిప్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. వెంట వెంటనే రెండు వికెట్లు పడినా.. ఇషాన్ కిషన్(38 నాటౌట్) ఒత్తిడికి లోనవ్వలేదు. అప్పటికే విజయం ఖరారు కాగా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ(15 నాటౌట్)తో కలిసి లాంఛనం పూర్తి చేశాడు ఇషాన్. 15వ ఓవర్లో బౌండరీతో జట్టును గెలిపించాడీ చిచ్చరపిడుగు. 7 వికెట్లతో జయభేరి మోగించిన్ మెన్ ఇన్ బ్లూ మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ పట్టేసింది.




నామమాత్రమైన మూడో టీ20 సెప్టెంబర్ 17న జరుగనుంది.

**నబీ, రషీద్ ధనాధన్** టాస్ ఓడిన అఫ్గనిస్థాన్‌కు మొదటి ఓవర్లోనే షాకిచ్చాడు అర్ష్‌దీప్ సింగ్. తొలి మ్యాచ్‌లో డకౌటైన ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్(0)ను అతడు సున్నాకే పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత నితీశ్ రెడ్డి(3-35) ఓవర్లో కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్(37)పెద్ద షాట్ ఆడి రవి బిష్ణోయ్ చేతికి చిక్కాడు. ధాటిగా ఆడుతున్న సెడీకుల్లా అటల్(12)ను రవి బిష్ణోయ్ ఔట్ చేయగా.. గుల్బదిన్(10), డార్విష్ రసూలీ(26)లు విఫలమయ్యారు.

# ఐజా మిర్‌కు పసిడి పతకం

## - హైదరాబాద్ హార్స్ షో ఫైనల్స్



**హైదరాబాద్ :** హైదరాబాద్ హార్స్ షో ఫైనల్లో ఐజా మిర్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. అండర్-14 విభాగం 110-115సెమీ షో జంపింగ్ పోటీల్లో ఐజా మిర్ సత్తా చాటింది. ఈ విభాగంలో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం సాధించిన ఐజా మిర్.. అండర్-14 విభాగం 100 సెమీ షో జంపింగ్‌లో నాల్గో స్థానంలో నిలిచింది. 25 మంది పోటీపడిన ఫైనల్లో ఐజా మిర్‌తో పాటు సెంతిల్, ఈశన్ భరద్వాద్, సంజయ్, ప్రభునూర్ సింగ్, వేదిక్, ఆమిర్, మిర్ నజముద్దీన్ ఆజామ్‌లు పతక ప్రదర్శనతో ఆకట్టుకున్నారు

## టెస్టుల్లో ఫ్లాప్.. వన్డేల్లో తొలి శతకంతో

# రెచ్చిపోయిన కుర్రాడు..!

మూడేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం అదరకున్నా వన్డేల్లో మాత్రం దంచేశాడు మ్యాట్ రెన్‌షా. బంగ్లాదేశ్‌పై తీవ్రంగా నిరాశపరిచిన అతడు జింబాబ్వేపై చితక్కొట్టాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన తొలి వన్డేలో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ కుర్రాడు శతకం బాదేశాడు. బ్రాడ్ ఎవాన్స్ ఓవర్లో సింగిల్ తీసిన అతడు 50 ఓవర్ల ఫార్మాట్‌లో మొదటి సెంచరీ నమోదు చేశాడు.స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో విఫలమైన ఆస్ట్రేలియా కుర్రాడు మ్యాట్ రెన్‌షా వన్డేల్లో శతక్కొట్టాడు. మంగళవారం హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జింబాబ్వే బౌలర్లను ఈ లెఫ్ట్ హ్యాండర్ ఉతికేశాడు. టాపార్డర్ విఫలమైనా వన్డేల్లో మొదటి సెంచరీతో జట్టుకు భారీ స్కోరందించాడు. 107కే నాలుగు వికెట్లు పడిన వేళ.. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 18వ ఓవర్లో క్రీజులోకి వచ్చి ధనాధన్ ఆటతో అలరించిన అతడు 94 బంతులు ఎదుర్కొని 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 109 రన్స్ సాధించాడు.ఆతిథ్య బౌలర్లను ఎడాపెడా ఉతికేస్తూ.. అలెక్స్ క్యారీ, ఓలీ పీకేలతో కలిసి రెన్‌షా విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు రెన్‌షా. దాంతో, ఆసీస్ 8 వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న ఆస్ట్రేలియాకు.. రెన్‌షా రూపంలో ఆరో స్థానంలో అదరగొట్టే బ్యాటర్ దొరికాడు.

# ‘మండాడి‘ జాక్‌పాట్..

## 5 రోజుల్లోనే రూ. 65 కోట్ల వసూళ్లు!




తెలుగు నటుడు సుహాస్, తమిళ నటుడు సూరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘మండాడి‘. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లను రాబడుతోంది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహించిన ఈ చిత్రం, విడుదలైన కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 65 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. ఈ చిత్రం సాధిస్తున్న ఘనవిజయం నిర్మాత ఎల్రెడ్ కుమార్‌కు భారీ లాభాలను తెచ్చిపెడుతోంది. సుమారు రూ. 45 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ కైవసం చేసుకుంది. అయితే, ఈ ఒప్పందం బాక్సాఫీస్ వసూళ్ల ఆధారంగా కుదరడం గమనార్హం. సినిమా గ్రాస్ వసూళ్లు రూ. 50 కోట్లు దాటితే రూ. 30 కోట్లు, రూ. 60 కోట్లు దాటితే రూ. 40 కోట్లు చెల్లించేలా నెట్‌ఫ్లిక్స్ ఒప్పందం చేసుకుంది. ప్రస్తుతం ‘మండాడి‘ వసూళ్లు రూ. 65 కోట్ల మార్కును అధిగమించడంతో, నిర్మాతకు నెట్‌ఫ్లిక్స్ నుంచి రూ. 40 కోట్లు అందనున్నాయి. థియేట్రికల్ వసూళ్లతో పాటు నాన్-థియేట్రికల్ హక్కుల ద్వారా కూడా నిర్మాతకు ఆశించిన దానికంటే ఎక్కువ లాభాలు వస్తున్నాయి. విభిన్నమైన కథాంశం, ఉత్కంఠ కలిగించే బోట్ రేసింగ్ సన్నివేశాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇదే వేగం కొనసాగితే ఈ చిత్రం త్వరలోనే రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఇద్దరం మంచి స్నేహితులం

## ఆనంద్ దేవరకొండతో రిలేషన్ లో ఉందనే వార్తలపై వైష్ణవి చైతన్య క్లారిటీ

టాలీవుడ్ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్యలు రిలేషన్ లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. బ్లాక్‌బస్టర్ చిత్రం ‘బేబి’తో పాటు ‘ఎపిక్’లో కలిసి నటించిన ఈ జోడీ రీల్ లైఫ్ కెమిస్ట్రీ చూసి, వీరిద్దరూ రియల్ లైఫ్ లోనూ ప్రేమలో ఉన్నారని, త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది.

ఈ డేటింగ్ రూమర్లపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన వైష్ణవి చైతన్య, తమ మధ్య ఎలాంటి రొమాంటిక్ రిలేషన్‌షిప్ లేదని తేల్చి చెప్పింది. తామిద్దరం మంచి కో-స్టార్స్ మాత్రమే కాకుండా ఆత్మీయ స్నేహితులమని తెలిపింది. ఇదే సమయంలో ఆనంద్ దేవరకొండ పెళ్లి ప్రణాళికల గురించి మాట్లాడుతూ... రాబోయే మూడేళ్లలో వివాహం చేసుకుంటానని చెప్పాడు. అయితే తనకు మాత్రం ఇప్పట్లో వివాహం ఆలోచన లేదని, కేవలం సినిమాలపైనే దృష్టి సారిస్తానని వైష్ణవి స్పష్టం చేసింది.



# డేవిడ్ రెడ్డిలో రమ్యకృష్ణ ..

### ఫస్ట్‌లుక్‌తో అంచనాలు పెంచిన మేకర్స్



మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా ‘డేవిడ్ రెడ్డి’లో రమ్యకృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె పోషిస్తున్న ‘కమలా రెడ్డి’ పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం మంగళవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. రమ్యకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేయడం విశేషం.

పోస్టర్‌లో రమ్యకృష్ణ చాలా గంభీరంగా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో కీలకంగా ఉండబోతున్నట్లు లుక్ చూస్తే అర్థమవుతోంది. ఈ పోస్టర్‌ను మంచు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. రమ్యకృష్ణతో కలిసి నటించడం గౌరవంగా ఉందని పేర్కొన్నారు. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రపై పట్టు అద్భుతమని ప్రశంసించారు.

ఇప్పటికే ఈ సినిమాలో ఉక్రెయిన్ మోడల్, నటి మరియా రియాబోషప్కా ‘క్లారా విట్‌మోర్’గా నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఆమె పాత్ర ప్రేమతో పాటు ప్రతీకారం, పోరాటంతో ముడిపడి ఉంటుందని చిత్రబృందం గతంలో తెలిపింది. ‘డేవిడ్ రెడ్డి’కి హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. 1897 నుంచి 1922 మధ్య కాలంలో కథ సాగనుంది. చరిత్ర నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అంశాలు ఉండనున్నాయి. మంచు మనోజ్ సినీ ప్రయాణం 21 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది ఆగస్టులో ఈ సినిమాను ప్రకటించారు. తన కెరీర్‌లో ఇది 21వ చిత్రమని అప్పట్లో వెల్లడించారు.

# కెరీర్‌లోనే అత్యంత కీలక పాత్రలో రష్మిక..

## ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్ ఖరారు

### నిర్మాతలుగా అల్లు అరవింద్, బన్నీ వాస్, రాక్‌లైన్ వెంకటేశ్




స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన కెరీర్‌లోనే ఒక ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టును దక్కించుకున్నారు. దిగ్గజ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించనున్నట్లు అధికారికంగా ఖరారైంది. ‘ఎం.ఎస్. - ఎ లెగసీ ఆన్ స్క్రీన్‘ అనే టైటిల్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నటిగా రష్మిక కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని భావిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవాన్ని రేపు (సెప్టెంబర్ 16న) ఎం.ఎస్. సుబ్బులక్ష్మి 110వ జయంతిని పురస్కరించుకుని చెన్నైలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఇండియన్ కోరల్ ఎన్‌సెంబుల్ బృందం, సుబ్బులక్ష్మి ఆలపించిన కొన్ని అజరామర గీతాలతో సంగీత నివాళి అర్పించనుంది. ‘జెర్సీ‘ చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తుండగా, స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

టాలీవుడ్ అగ్ర నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాస్‌లతో కలిసి ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాత్ర కోసం చిత్రబృందం మొదట సాయి పల్లవి, రుక్మిణి వసంత్ వంటి నటీమణులను పరిశీలించింది. అయితే, ఇతర ప్రాజెక్టుల కారణంగా సాయి పల్లవి ఈ అవకాశం వదులుకున్నట్లు సమాచారం. అనంతరం నిర్వహించిన స్క్రీన్ టెస్టులో రష్మికను ఈ పాత్రకు ఎంపిక చేశారు. భారతరత్న పురస్కార గ్రహీత అయిన ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, కేవలం శాస్త్రీయ సంగీతానికే పరిమితం కాలేదు. ఆమె ‘సేవాసదనం‘, ‘శకుంతలై‘, ‘సావిత్రి‘, ‘మీరా‘ వంటి చిత్రాల్లో నటించి నటిగా కూడా తనదైన ముద్ర వేశారు. అలాంటి గొప్ప వ్యక్తి పాత్రను పోషించడం రష్మికకు నటిగా అతిపెద్ద సవాల్ అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక, రష్మిక నటిస్తున్న ఇతర సినిమాల విషయానికొస్తే.. యాక్షన్ థ్రిల్లర్ ‘మైసా‘ నవంబర్ 27న విడుదల కానుండగా, విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్న పాన్-ఇండియా యాక్షన్ డ్రామా ‘రణబాలి‘ అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఆసక్తి రేపుతున్న ‘అనుమాన పక్షి‘ ట్రైలర్




‘డీజే టిల్లు’ చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ మరో వినూత్న కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం ‘అనుమాన పక్షి’. టాలెంటెడ్ నటుడు రాగ్ మయూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఆసక్తికరమైన కథాంశంతో రూపొందిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.

ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ కథ మొత్తం హీరో పాత్రకున్న ‘అనుమానం’ అనే బలహీనత చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ప్రతి చిన్న విషయాన్ని అనుమానించే వ్యక్తిగా రాగ్ మయూర్ నటన, హావభావాలు నవ్వులు పూయిస్తున్నాయి. కేవలం కామెడీ మాత్రమే కాకుండా, క్రైమ్ థ్రిల్లర్, డార్క్ కామెడీ అంశాలను కూడా దర్శకుడు జోడించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, బ్రహ్మాజీ, అజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ నిర్మిస్తున్న ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. వైవిధ్యమైన కథతో వస్తున్న ఈ ‘అనుమాన పక్షి’ సెప్టెంబర్ 18న థియేటర్లలో విడుదల కానుంది. ‘డీజే టిల్లు’ లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత విమల్ కృష్ణ ఎలాంటి వినోదాన్ని అందిస్తారోనని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.